# కుంటలో జాతీయ రోడ్డు నిర్మాణం

- తగ్గనున్న కుంట శిఖం


కుంటలో రోడ్డు నిర్మాణ పనులు

**శంకరపట్నం:** కరీంనగర్–వరంగల్ ఫోర్‌లైన్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శంకరపట్నం మండలం కొత్తగట్టు రెవెన్యూ గ్రామ పరిధిలోని రెండు కుంటల్లో జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. కొత్తగట్టు రెవెన్యూ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న కుంట భూమి, కొత్తగట్టు శివారులోని సాయికుంట సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు యంత్రాలతో చేస్తున్నారు. 100 ఫీట్ల డబుల్ రోడ్డు ఉండగా.. మరో 60 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మొత్తంగా 160 ఫీట్లు వెడల్పుతో రోడ్డు నిర్మాణం జరుగుతుండగా.. గతంలో ఉన్న 100 ఫీట్లకు అదనంగా మరో 60 ఫీట్లు ఒకేవైపు భూముల నుంచి భూసేకరణ చేపట్టారు. గతంలో భగీరథ పైపులైన్ నిర్మాణ పనులు జరిగాయి. పైప్‌లైన్ వైపు రోడ్డు వెడల్పునకు సాధ్యం కానందున వరంగల్ వైపు వెళ్లే దారిలో ఎడమ వైపు భూసేకరణ చేపట్టడంతో.. కొత్తగట్టు రెవెన్యూ గ్రామంలోని భూంకుంట, సాయికుంటలో ఫోర్‌లైన్ విస్తరణ పనులు చేపడుతూ చెరువులో మట్టి పోస్తున్నారు. గతంలో ఉన్న కుంటలో 60 ఫీట్ల వరకు స్థలాన్ని సేకరించడంతో.. ఇప్పటికే చిన్నగా ఉన్న భూమి కుంట మరీ చిన్నదై నీటి నిలువ లేకుండా పోయే అవకాశముంది.

**రైతుల ఆందోళన**

ఎస్సారెస్పీ కాలువ నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు భూములపై ఆధారపడిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రెండు కుంటల్లో రోడ్డు వెడల్పులో కుంట భూములు పోవడంతో నీటి నిల్వలు తగ్గనున్నాయి. ఇప్పటికే నీటి కొరత లేకుండా చెరువులు, కుంటలను కాపాడాల్సిన అధికారులు భూసేకరణ చేయడంతో పరిమాణం తగ్గనుంది.

### చేపల పెంపకంపై ప్రభావం



రెండు కుంటల్లో చేపల పెంపకం చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆశపడ్డాం. ఈ రెండు కుంటల్లో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో కుంట విస్తీర్ణం తగ్గి చేపల పెంపకంపై ప్రభావం పడింది. మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం చెరువులు, కుంటల్లో నిర్మాణాలు చేయకుండా నీటిని విడుదల చేయాలి.

– పిట్టల సమ్మయ్య, మత్స్యకారుడు

### తగ్గనున్న నీటి నిల్వలు

కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంది. కుంటలో రోడ్డు నిర్మాణం చేపట్టడంతో నీటి నిల్వలు తగ్గనున్నాయి. కుంట కింద పంటలు ఎండిపోయే ప్రమాదముంది. కుంటలో శిఖం భూమి పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తిరుపతి, రైతు, గొల్లపల్లి

## ఎండుతున్న వరి పొలాలు


కోరటపల్లిలో ఎండిపోయిన వరి పంట

**రామడుగు:** రామడుగు వాగు వెంట ఉన్న గ్రామాలైన షానగర్, కోరటపల్లి, రామడుగు, మోతె, గాండ్లపల్లి గ్రామాల్లో వాగుపై ఆధారపడి వరి పంట సాగు చేసుకున్న వరి పంట పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోరటపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకాంతరెడ్డికి చెందిన దాదాపు 15 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాగు వెంట దాదాపు ఐదు గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయి తీవ్రంగా నష్టం వాటిల్లిందని పలు గ్రామాల రైతులు తెలిపారు. వాగుకు వరద కాలువ నుంచి నీటిని విడుదల చేసి తమ పంట పొలాలను కాపాడాలని కోరుతున్నారు.

## కేసీఆర్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు


రైతులతో కలిసి పంటలను పరిశీలిస్తున్న తుమ్మేటి

**వీణవంక:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, కేసీఆర్ మాటలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. లస్మక్కపల్లి గ్రామంలో మొక్కజొన్న, వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. సాగునీటి సమస్య ఏమైనా ఉందా అని రైతులనడిగి తెలుసుకున్నారు. విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లస్మక్కపల్లి గ్రామానికి పుష్కలంగా కాలువ నీళ్లు వస్తున్నాయని, ఎక్కడ కూడా గుంట భూమి ఎండిపోలేదని అన్నారు. టీపీసీసీ సభ్యుడు కర్ర భగవాన్‌రెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, వావిలాల సత్యనారాయణ, మ్యాకల సమ్మిరెడ్డి, లక్ష్మణ్, అనిల్‌రెడ్డి, సమ్మయ్య తదితరులున్నారు.

## క్లుప్తంగా

### నవోదయకు ఎంపిక

**సైదాపూర్:** ఆకునూర్ ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న ఈదులకంటి వినూత్‌రెడ్డి నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశానికి రాసిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. చొప్పదండి నవోదయ విద్యాలయంలో 6వతరగతి సీటు సాధించిన వినూత్‌రెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు.


రామడుగు: ఆరాధ్యను సన్మానిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ

**రామడుగు:** గోపాల్‌రావుపేట శ్రీప్రగతి పాఠశాలలో చదువుతున్న బొల్లాడి ఆరాధ్య నవోదయ పాఠశాలలో ఆరోతరగతి సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆయనతోపాటు డైరెక్టర్లు ఉప్పుల శ్రీనివాస్, కాసర్ల ఆనంద్, బేతి భూమయ్య, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి సన్మానించి అభినందించారు.

### విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

**గంగాధర:** మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎ.అద్వైత్ నవోదయ సీటు, రిషేందర్, అభిషేక్, జశ్వంత్, సాహిత్ సైనిక్ పాఠశాలలో 6వతరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారు. కె.హేమలత సైనిక కళాశాలకు అర్హత సాధించింది. వీరిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, నర్సింగరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిరుపేద యువతి పెళ్లికి 'చేయూత'


పెళ్లి సామగ్రి అందిస్తున్న చేయూత ఫౌండేషన్ నిర్వాహకులు

**జమ్మికుంట:** తనుగుల గ్రామానికి చెందిన పెగడపల్లి రవళి అనే నిరుపేద యువతి పెళ్లికి చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దూడపాక శ్రీనివాస్, నిర్వాహకులు అబేదబాను, శిరీష రూ.5వేల విలువ చేసే మెట్టెలు, దుస్తులను సోమవారం అందజేశారు. యువతి తల్లి రాధమ్మ, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలి

**గన్నేరువరం:** మహనీయుల మహోత్సవాల్లో భాగంగా ఈనెల 2 నుంచి 8 వరకు జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టే రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాసూరి మల్లికార్జున్ కోరారు. సోమవారం ఖాసీంపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పీడిత సామాజికవర్గాలను సంఘటితపరిచి రాజ్యాంగాన్ని రక్షిస్తూ జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు తెలంగాణ అధ్యక్షుడు పెల్లి సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కలిసి ఈ యాత్ర చేపట్టి 8న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.

### రైతు భరోసాను విజయవంతం చేయాలి

**హుజూరాబాద్:** ఈనెల 5న కరీంనగర్ రానున్న మాజీ సీఎం కేసీఆర్ రైతు భరోసాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ కోరారు. సోమవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడం కేసీఆర్‌ను కలచివేసిందని, అందుకే రైతులకు భరోసా ఇచ్చేందుకు జిల్లాల పర్యటన చేపట్టారన్నారు. మండల అధ్యక్షుడు సంగెం ఐలయ్య, కౌన్సిలర్లు కల్లేపల్లి రమాదేవి, కేసిరెడ్డి లావణ్య, ముక్క రమేశ్, కొండల్‌రెడ్డి, జిల్లా నాయకుడు ఇరుమల్ల సురేందర్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి తులసి లక్ష్మణమూర్తి, మాజీ సర్పంచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతు దీక్షను జయప్రదం చేయండి

**చొప్పదండి:** బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ మంగళవారం కరీంనగర్‌లోని పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో రైతు దీక్ష నిర్వహిస్తున్నందున పెద్దఎత్తున రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మినారాయణ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు రూ.12వేల వంటి హామీల అమలులో లోపంతోపాటు ఎండిపోయిన పంటలకు పరిహారం తదితర డిమాండ్లపై దీక్ష సాగిస్తున్నందున రైతులు మద్దతు పలకాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు


గాయపడ్డ శ్రీహర్ష

**తిమ్మాపూర్:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని గాయపడింది. పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన ఉప్పాల శ్రీహర్ష బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రైవేట్ గర్ల్స్ హాస్టల్లో ఉంటోంది. పానీపూరి కోసం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి హాస్టల్ నుంచి సాయంత్రం బయటకు వచ్చింది. రాజీవ్ రహదారి దాటుతున్న క్రమంలో బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీహర్ష తీవ్రంగా గాయపడింది. బైక్ నడుపుతున్న రామకృష్ణకాలనీకి చెందిన యువకుడు సోను సైతం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారమందించగా.. వారు వచ్చి ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి ఎస్సై చేరాలు వచ్చి వివరాలు తెలుసుకున్నారు.

## రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి


హుజూరాబాద్: తహసీల్ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు


శంకరపట్నం: వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

**హుజూరాబాద్:** తీవ్ర సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్ కార్యాలయంలో బీజేపీ నాయకులు ఆర్ఐకి వినతి పత్రం సమర్పించారు. మండలంలో కొన్నిచోట్ల సరైన సమయంలో సాగునీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోయాయని వాపోయారు. పారిపెల్లి కొండల్‌రెడ్డి, వోడ్నాల విజయ్, రావుల భాస్కర్‌రెడ్డి, తూర్పాటి రాజు, రావుల వేణు, అంకటి వాసు, యంసాని శశిధర్, యాళ్ల సంజీవరెడ్డి, ముప్పు మహేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**కాలువ నీటిని విడుదల చేయాలని ఆందోళన**

**శంకరపట్నం:** పంటలు ఎండిపోకుండా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని తహసీల్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం రైతులు ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ వెంటనే రైతులకు పెట్టుబడి సహాయం అందించాలని మండల అధ్యక్షుడు అనిల్ డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. నరేందర్, రాములు, సంపత్, సాగర్, శివారెడ్డి పాల్గొన్నారు.

**వీణవంక:** రైతాంగాన్ని ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి తహసీల్దార్ నిజామొద్దీన్‌కు వినతి పత్రం అందించారు. నరసింహారాజు, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, సంతోష్, శ్రీనివాస్, రాకేశ్, రాజు, రాంమూర్తి, అజయ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

**సైదాపూర్:** అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు, సాగునీరందక ఎండుతున్న పంటల సర్వే చేయించి రైతులకు నష్ట పరిహారమందించాలని బీజేపీ మండల నాయకులు తహసీల్ కార్యాలయంలో గిర్దావర్ శరత్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**జమ్మికుంట:** రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుడు జీడి మల్లేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అకుల రాజేందర్, రామిడి సురేందర్‌రెడ్డి, పైండ్ల మోహన్‌రెడ్డి, పల్లపు రవి, ఠాగూర్ రాజేశ్, కైలాష్‌కోటి గణేశ్, ఇటుకాల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

**గన్నేరువరం:** అకాల వర్షాలకు మండలంలో ఇటీవల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25వేల నష్ట పరిహారమందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ కోరారు. రైతులకు పంట నష్ట పరిహారం, రుణమాఫీని వెంటనే అమలు చేయాలని కోరుతూ తహసీల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఫహీమొద్దీన్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. మునిగంటి సత్తయ్య, బండి తిరుపతి, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, గంగాధర శ్రీకాంత్, బోయిని లక్ష్మణ్, చిగురు సంజీవ్ పాల్గొన్నారు.

**రూ.25వేలు నష్ట పరిహారమందించాలి**

**మానకొండూర్‌రూరల్:** బీజేపీ నాయకుడు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్యకు వినతి పత్రం సమర్పించారు. పంట నష్టపోయిన రైతులకు రూ.25వేలు నష్ట పరిహారమందించాలని డిమాండ్ చేశారు. రామకృష్ణారెడ్డి, లక్ష్మణాచారి, రాజిరెడ్డి, శ్రీనివాస్, ఎస్.రమణయ్య, రమేశ్‌పటేల్, అశ్విన్, భూమయ్య, వరప్రసాద్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్యదర్శి రెడ్డినాయక్

**జమ్మికుంట:** జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో జమ్మికుంట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి గగూలోతు రెడ్డినాయక్, పీఏసీఎస్ సీఈవో రవీందర్ సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన ఉత్పత్తులను చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసి అమ్మకానికి తీసుకురావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధాన్యం క్వింటాల్ ఏ గ్రేడ్‌కు రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 ధరలున్నాయని తెలిపారు. రైతులు, హమాలీలు, దాడువాయి కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సైదాపూర్:** నల్లానితండాలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం కుమారస్వామి ప్రారంభించారు. రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీసీ జమున, వీవో అమిత, వీవోఏ నిర్మల, రైతులున్నారు.

## ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

**జమ్మికుంట:** పట్టణంలో ఓటు హక్కు వినియోగంపై మున్సిపల్ కమిషనర్ అయాజ్, డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మల్లేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. రాణి, మౌనిక, జ్యోతి, మంజుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ నాయకుడి మృతిపై సంతాపం

**జమ్మికుంట:** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండెడు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మంద రవీందర్ మరణానికి చింతిస్తూ వారి కుటుంబానికి జమ్మికుంటలో జనతాదళ్(సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి ప్రగాఢ సంతాపాన్ని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సరిగోమ్ముల మనోహర్, తిప్పారపు రమేశ్‌బాబు, ఇంజం సాంబయ్య, ఆనంద్ తదితరులున్నారు.

## దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న దళితబంధు సాధన సమితి నాయకులు

**జమ్మికుంట:** దళిత సంఘం నాయకుడు, ఈటల బాధితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిప్పారపు సంపత్‌పై హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఈటల రాజేందర్ అనుచరులు, బీజేపీ నాయకులు దాడికి పాల్పడ్డారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ నియోజకవర్గ దళితబంధు సాధన సమితి సభ్యులు కోలుగూరి సురేశ్, మంద రాజేశ్, కోలుగూరి నరేష్, ఎస్సీ 57 ఉప కులాల హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తూర్పటి లింగయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈటల రాజేందర్ క్షమాపణలు చెప్పాలన్నారు. అకినపల్లి ఆకాష్, రామంచ రాకేశ్, కొడెపాక రక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ స్కిల్స్ పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ కె.శంకర్

**హుజూరాబాద్‌రూరల్:** సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యార్థులు సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. సోమవారం సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీవోప్స్ శిక్షణ ప్రారంభోత్సవం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు గమనించాలని, వృత్తి నైపుణ్యం ప్రయోగశాల, వర్క్‌షాపులో నేర్చుకోవాలన్నారు. ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ రావు, డాక్టర్ యోగేష్ పుండలిక్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె.రవీంద్రబాబు, కార్యశాల సమన్వయకర్త ప్రశాంత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పురుగు మందుల వాడకంపై అవగాహన

**హుజూరాబాద్:** పురుగు మందుల వాడకంపై అడమ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం జనగామ జిల్లాలో జరగగా.. హుజూరాబాద్ మండలం నుంచి పలువురు రైతులు హాజరయ్యారు. అడమ కంపెనీ గ్లోబల్ సీఈవో స్టీవ్ హస్కిన్స్, గ్లోబల్ సీఎఫ్‌వో ఎప్రాట్నాగర్, సౌత్ హెడ్ పప్పునాయుడు హాజరై మాట్లాడారు. వరికి వచ్చే రోగాలకనుగుణంగా తమ కంపెనీ పరిశోధనలు చేసి కొత్త క్రిమిసంహారక తయారీకి ప్రయత్నాలు ఎప్పటికప్పుడు చేస్తుందని వెల్లడించారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి


కార్మికురాలిని సన్మానించిన అధికారులు, సిబ్బంది

**జమ్మికుంట:** మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వర్తిస్తున్న దొడ్డె సమ్మమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ అయాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు కరోనా సమయంలో చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కటిక సేవ సంఘం కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

**హుజూరాబాద్:** పట్టణంలోని కటిక సేవ సంఘం సభ్యులంతా సోమవారం సమావేశమై కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా కోయల్‌కార్ రమేశ్, అధ్యక్షుడిగా మిర్యాలకార్ చందాజీ, ఉపాధ్యక్షులుగా కోయల్‌కార్ దుర్గాజీ, కార్యదర్శిగా కోయల్‌కార్ బాలాజీ, సంయుక్త కార్యదర్శిగా రావులకార్ యాదగిరి, కోశాధికారిగా కోయల్‌కార్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా జమాల్పూర్ అనిల్, కోయల్‌కార్ సాయిరాం, ముఖ్య సలహాదారులుగా కోయల్‌కార్ శ్రీనివాస్, గోగికారి తుక్కాజీ, జమాల్‌పూర్ సంతోష్, ఆస్‌కార్ రమేశ్ ఎన్నికయ్యారు.

### అఖిల్ కుటుంబానికి అండగా ఉంటాం

**కరీంనగర్ కార్పొరేషన్:** ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భరోసా ఇచ్చారు. సోమవారం నగరంలోని ముకరంపురలో గల అఖిల్ నివాసానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజొద్దీన్, సమద్ నవాబ్, ఇర్ఫాన్, పెద్దిగారి తిరుపతి, లయాక్, కొట్టె ప్రభాకర్, షేక్ శహన్నా, అష్రఫ్, మాసుం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### 7న ప్రవేశ పరీక్ష

**వీణవంక:** మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 6వతరగతి విద్యార్థులకు ఉదయం 10–12 గంటల వరకు, 7, 8, 9, 10 తరగతులకు మధ్యాహ్నం 2–4 గంటల మధ్య ఉంటుందని, 1 నుంచి హాల్ టికెట్ తీసుకోవచ్చని సూచించారు.